


కస్తూరి మురళీకృష్ణ

# సాలీడు గూడులో..!

చకచకా పద్ధతి ప్రకారం అందంగా గూడు అల్లుతోంది సాలీడు.

సాలీడు ఏకాగ్రతగా గూడు అల్లుతూనే ఉంది. మగసాలీడు దాన్ని ఆకర్షించాలని విశ్వప్రయత్నాలు ఆరంభించింది. ఓ సన్నని దారాన్ని పట్టుకుని వ్రేలాడుతూ, గూడులోకి అడుగుపెట్టింది. కానీ, ఆడ సాలీడు దగ్గరకు వస్తూంటే, గబగబా బయటకు జారింది.

ఇది నాకు విచిత్రమనిపించింది.

ఆడ సాలీడును ఆకర్షించాలన్నదే మగసాలీడు ప్రయత్నం. మరి అది దగ్గరకు వస్తూంటూనే, మగ సాలీడు దూరం పారిపోవడం ఎందుకు? ఇదో రకమైన మేటింగ్ ఆటనా?

కుతూహలంగా వాటి ఆటను పరిశీలించసాగాను.

క్రిందకు జారిన మగసాలీడు, మరో వైపు నుంచి గూట్లోకి అడుగు పెట్టాలని ప్రయత్నాలు ఆరంభించింది.

ఈసారి ఆడ సాలీడు, మగ సాలీడు పట్టుదల చూసి కనికరించినట్టుంది. మగసాలీడు గూటిలో అడుగు పెడుతూంటే కదలలేదు. చూసీ చూడనట్టు ఊరుకుంది.

జాగ్రత్తగా, అడుగులో అడుగు వేసుకుంటూ, మగ సాలీడు, ఆడ సాలీడుని సమీపించింది. క్షణంలో రెండూ పెనవేసుకున్నాయి. కొన్ని క్షణాల పాటు రెండూ కలసిపోయి ప్రేమ కౌగిలిలో ఉండిపోయాయి.

కాస్సేపటికి ఒకో కాలినీ కదుపుతూ, ఎంతో జాగ్రత్తగా మగసాలీడు, ఆడ సాలీడు నుంచి విడివడటం ఆరంభించింది.

అది చూస్తున్న నాకు ఆశ్చర్యం అనిపించింది.

ఎందుకంటే, అంతకాలం తన్మయత్వంతో హత్తుకుపోయిన మగసాలీడు, విడివడుతూ తనప్రాణాల్ని రక్షించుకునేందుకు పారిపోవటానికి సన్నాహాలు చేస్తున్నట్టనిపించింది.

నా ఆలోచన నిజమని నిరూపిస్తూ, ఆడ సాలీడు నుంచి దూరం కాగానే, మగసాలీడు ఎంతో వేగంగా గూడు వదలి పరుగెత్తటం ఆరంభించింది.

ఒక్క క్షణంలో తన్మయత్వాన్ని వదల్చుకుని, ఆడ సాలీడు దాన్ని వెంబడించింది. దాదాపుగా గూడు నుండి బయటపడే సమయంలో మగ సాలీడును అంది పట్టుకుంది. తన పరిష్వంగంలో బంధించింది.

కాస్సేపటికి గిలగిల కొట్టుకుంటూ మగసాలీడు ప్రాణాలు విడిచింది!

భవిష్యత్తు తిండిగా దాన్ని భద్రపరచుకుంది ఆడసాలీడు. మళ్ళీ, ఏమీ జరగనట్టు గూడు అల్లటం ఆరంభించింది.

ఆసక్తిగా అన్నీ మరచి చూస్తున్న నేను, తెరచి ఉన్న నోటినుంచి సిగరెట్టు జారి తొడపై పడి చుర్రుమనటంతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాను.

కిలకిల నవ్వు వినిపించింది.

ఉలిక్కిపడ్డ నన్ను చూసి, ఎదుటి ఇంటి కిటికీ అమ్మాయి నవ్వుతోంది.

నేనూ నవ్వాను. కిటికీ దగ్గరకు వెళ్లాను.

***

హోటల్ 'హైస్పిరిట్స్'లో మూడో అంతస్థులో 305వ గది నెంబరులో వరుసగా నాలుగు శనివారాలు, నలుగురు ఒకే రకమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయారు.

మొదటి వ్యక్తి ప్రాణాలు కోల్పోయినప్పుడు ఆత్మహత్య అనుకున్నారు. ఎందుకంటే, అతడు కిటికీ నుంచి కర్టెన్ మెడకు చుట్టుకుని వ్రేలాడుతూ దొరికాడు. అతడు ఆత్మహత్య చేసుకోవటానికి ఎలాంటి కారణాలు కనిపించలేదు. హత్య అనటానికి ఆధారాలూ దొరకలేదు.

ఈ విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. మళ్లీ, శనివారం అదే గదిలో అదేరకంగా మరో వ్యక్తి మరణం సంభవించింది.

మళ్లీ అలాగే వ్రేలాడుతూ లభించింది శవం.

ఇలా ఇంకో రెండు శనివారాలు వరుసగా జరగటంతో, ఆ గదిలో దయ్యం ఉందన్న వదంతులు ఊరంతా వ్యాపించాయి.

ఇలాంటి సంఘటనలు జరిగేది శనివారమే అయినా, మిగతా రోజుల్లో కూడా జనాలు ఆ హోటల్ కేసి రావటం మానేశారు.

వార్తల కోసం ఆత్రపడే చానళ్లు, రోజుకి పదేసిసార్లు ఇదే వార్తను రక రకాలుగా తిరగేసి మరగేసి ప్రసారం చేస్తుండటంతో ఊరు ఊరంతా హైస్పిరిట్ హోటల్ పేరు చెప్తేనే ఆమడ దూరం పారిపోసాగారు.

హోటల్ వారికేకాదు. పోలీసులకు కూడా 305 గదిలో జరుగుతున్న సంఘటనలు తలనొప్పిగా పరిణమించాయి. అదే గదిలో, ప్రతి శనివారం మరణం సంభవించటాన్ని పరిశోధించమని వారిపై ఒత్తిడి పెరగసాగింది.

మరోవైపు, ఆ గదిలో దయ్యాలు, భూతాలు లేవని నిరూపిస్తానని ప్రకటించి, ఓ హేతువాది శనివారం ఆ గదిలో ఉన్నాడు. ఆదివారం ప్రొద్దుటికల్లా అతను కిటికీ నుంచి వ్రేలాడుతూ శవమై పోయాడు. దాంతో 'దయ్యం లేదు' అని ఎవరూ ధైర్యంగా అనలేకపోయారు. అన్నవారు కూడా ఆ గదిలో ఉండేందుకు ధైర్యంగా ముందుకు రాలేదు.

ఈ కేసును నాకు అప్పగించినప్పుడు ఇదీ పరిస్థితి.

'ఎలాగయినా హంతకుడిని పట్టుకోవాలి' నాపై అధికారుల ఆజ్ఞ అది.

'ఎలాగయినా దయ్యం లేదని నిరూపించాలి'. నోట్ల కట్టలు నా చేతిలో కుక్కుతూ బ్రతిమిలాడాడు మేనేజర్.

హోటల్ గదికి నా మకాం మార్చేముందు పోలీసు రిపోర్టులు, పోస్టు మార్టం రిపోర్టులు క్షుణ్ణంగా పరిశీలించాను.

అన్ని రిపోర్టులూ ఒకే రకంగా ఉన్నాయి. ఊపిరి అందక మరణించారు. కారణం, మెడచుట్టూ కర్టన్ పట్టు బిగియటం. ఇది కాక అన్ని రిపోర్టులలో మరో విషయం కనిపించింది. మరణించిన వారి శరీరంపైన చనిపోయిన సాలీడు దొరికింది.

గదికి చేరగానే, గది నాలుగు మూలలు జాగ్రత్తగా వెతికాను. గదిలో బూజు ఎక్కువ. శుభ్రం చేసి నిట్టూర్చే సరికి మళ్లీ సాలెపురుగు గూడు అల్లేస్తుంది. అందుకే, మరణించిన వారి శరీరంపైన సాలె పురుగులుండి ఉంటాయి.

ఇలా గదిని పరిశీలిస్తున్నప్పుడే ఆడ సాలెపురుగు, మగ పురుగును చంపటం చూశాను. అది చూసి నేను ఆశ్చర్యపోతూంటే, కిటికీకి అవతల నుంచి ఓ అమ్మాయి నవ్వటం విన్నాను.

***

భోజనం తెచ్చిన వెయిటర్‌ని అడిగాను. 'హోటల్‌లో ఎవరూ లేరు. అంతా ఖాళీ అన్నారు. మరి ఆ ఎదురు గదిలో ఉన్నదెవరు?'

వెయిటర్ నా వైపు భయంగా చూశాడు. కిటికీ బయటకు తొంగి చూశాడు.

'కిటికీ అవతల ఎవరూ లేరు సార్. అసలు అక్కడ గదే లేదు' అన్నాడు.

నాకు వాడితో మాటలు పెంచాలనిపించలేదు. వాడు వెళ్లిన తరువాత కిటికీలోంచి బయటకు చూశాను. ఆ వైపు కిటికీ వెనుకనుంచి ఎవరో చీకట్లోకి జారినట్టు తెలుస్తోంది.

అప్పటి నుంచీ కిటికీకి అవలివైపు కదలికల కోసం పరిశీలనగా చూడటం మొదలు పెట్టాను.

అయితే, నా దృష్టికి సాలీడు గూడు అడ్డువస్తోంది. తొలగించిన అరగంటకల్లా మళ్లీ కిటికీ బూజుతో నిండిపోతోంది. ఇదేదో ప్రత్యేకమైన సాలీడులా అనిపించింది. రాత్రి పడుకునే ముందు మాత్రం దీపాలు ఆర్పలేదు.

నేను అమ్మాయి వెంట పడటానికి కాదు. అనుమానాస్పద ఆత్మహత్యలను పరిశోధించటానికి ఆ గదిలో ఉన్నానని గుర్తుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నా ప్రాణాలు పోయే వీలుందని గుర్తుంది.

అందుకే గదిలో దీపాలన్నీ వెలిగించే ఉంచాను. తుపాకీని అందుబాటులో ఉంచుకున్నాను.

'ఇంతవరకూ ఎలాంటి సమస్యలేదు' అన్న మెసేజ్‌ను ఆఫీసర్‌కి ఇచ్చాను. నిద్ర పట్టేంతవరకూ, మరో పని లేకుండా గదంతా బూజుతో నింపేస్తున్న సాలీడు, నిరంతర పరిశ్రమను చూస్తూ గడిపాను. అలా గడిచింది సోమవారం.

మంగళవారం నాడు వేరే వెయిటర్ భోజనం తెచ్చాడు. పాత వెయిటర్ భయంతో పారిపోయాడని చెప్పాడు.



‘ఈ హోటల్‌లో ఎన్ని గదులున్నాయి?’ అడిగాను.

‘నాలుగు వందలు’ చెప్పాడు.

‘ఈ కిటికీకి ఎదురుగా ఉన్న గది నెంబరంత?’ కాజువల్‌గా అడిగి నట్టడిగాను.

నావైపు విచిత్రంగా చూశాడు.

‘ఈ గదికి ఎదురుగా గదే లేదండి’ అన్నాడు.

నేను కిటికీలోంచి బయటకు చూపాను.

‘ఆ గది నెంబరెంత?’

వాడూ బయటకు తొంగి చూశాడు. నా వైపు భయంగా భయంగా చూశాడు.

‘సార్... అక్కడ గదిలేదు...’’ చెప్పాడు.

నాకు ఒళ్లు మండింది. ‘సరే ఫో’ అన్నాను చిరాకుగా

బహుశా నా గురించి వెయిటర్లంతా మాట్లాడుకుని ఉంటారు. ఆ తరువాత నా గదిలోకి భోజనం తెచ్చి పెట్టి, నేను తిరిగి చూసేలోగా పరుగెత్తి పారిపోయే వారు. భోజనం పూర్తిచేసి సిగరెట్ కాలుస్తున్నా నా దృష్టి కిటికీలో సాలీడు అల్లిన గూడుపై పడింది. ఇందాక లేదు. అప్పుడే కిటికీని కప్పేసింది. సాలీడుగూడుకి అవల ఆ అమ్మాయి నవ్వుతూ కనిపించింది.

***

‘సిగరెట్ తాగుతూ నిద్ర పోయారా?’ అడిగింది నవ్వుతూ.

బూజు దులిపి చూశాను.


వెలుగు నీడల్లో ఉంది. అందంగా ఉంది. రూపం స్పష్టంగా కనబడటం లేదు. వయసు అంచనావేయటం కష్టంగా ఉంది. స్వరం కూడా విలక్షణంగా ఉంది. ఆమె అంతదూరం నుంచి మాట్లాడుతున్నా, నా దగ్గర ఉండి మాట్లాడుతున్నట్టుంది.

‘లేదు... మీ గది నెంబరంత?’ అడిగాను ఆత్రంగా.

ఆమె నవ్వింది. ‘నా పేరుకన్నా ముందు నా గది నెంబరు కావాలా? ఇండియా ఇంతగా అడ్వాన్స్ అయి పోయిందనుకోలేదు’.

సిగ్గుపడ్డాను. ‘మీ పేరేమిటి?’ అడిగాను.

‘నేను చెప్పను’ అంది నవ్వుతూ



ఇంతలో ఎవరో పిలిచినట్టు వెనక్కుతిరిగి చూసింది. నాకు చెయ్యి ఊపుతూ నీడలోకి వెళ్లిపోయింది. నాకు తెలియకుండానే నేనూ చెయ్యి ఊపాను.

ఆ తరువాత జరిగింది గుర్తుతెచ్చుకుంటే ఎంతో మధురంగా అనిపించింది. ఎంతగా తలుచుకుంటే, అంతగా మాధుర్యం పెరుగుతోంది. కాస్సేపటికి నా మనసంతా ఆమెనే నిండిపోయింది. దృష్టి కిటికీకి అతుక్కు పోయింది. ఆమె కనిపిస్తుందేమోనని ఎదురు చూస్తూ కూచున్నాను.

రాత్రి పడుకునే ముందు ఆఫీసర్ నుంచి ఫోను రాక పోతే నేను ఆ గదిలో ఎందుకున్నానో కూడా గుర్తుకు వచ్చేదికాదు.

‘ఇంతవరకూ ఎలాంటి క్లూలు దొరకలేదు. దయ్యము లేదు. హంతకుడు లేడు’ చెప్పాను. నాకు కనబడుతూ, ఇతరులకు కనబడని ఆ గది గురించి చెప్పాలా, వద్దా అని ఆలోచించాను. ‘తరువాత చూద్దాంలే’ అని వదిలేశాను.

బుధవారం చాలా ఆనందంగా నిద్రలేచాను. ప్రొద్దున్న లేచినప్పటి నుంచీ ఆనందంగానే ఉంది. ముఖ్యంగా నిద్రలేచీ లేవగానే నా దృష్టి కిటికీ వైపు మళ్లింది. నా కోసమే ఎదురుచూస్తున్నట్టు కిటికీకి ఆవలి నుంచి ఆమె చెయ్యి ఊపి నవ్వింది.

నా ఆనందానికి అంతులేదు. కుర్చీని కిటికీకి దగ్గరగా లాక్కుని కూచున్నాను.

మధ్యాహ్నానికల్లా ఇద్దరమూ సౌంజ్ఞల ద్వారా సంభాషించుకున్నాము. ఆమె ఎలా చేస్తే, నేను అలా చేశాను. ఇద్దరం నవ్వుకున్నాము.

ఇంతలో హఠాత్తుగా ఆమె కిటికీ దగ్గర నుంచి వెళ్లిపోయింది. ఎందుకో నాకు అర్థం కాలేదు. నిరాశగా అనిపించింది.

తలుపు తట్టి వెయిటర్ లోపలకు వచ్చి, భోజనం గబగబా టేబిల్ మీద పెట్టి, పరుగున వెళ్ళిపోయాడు. వెళ్తూ, నన్ను అదోలా చూశాడు.

నేను గదిలో ఉట్టిగా కూచుని ఫ్రీగా భోజనం చేస్తున్నందుకు వాడలా చూస్తున్నాడనిపించింది. ఒళ్లు మండింది.

త్వరత్వరగా భోజనం ముగించి కిటికీ దగ్గర కూచున్నాను. ఆమె కోసం ఎదురు చూస్తూ ఆ రోజుకి ఆమె మళ్లీ కిటికీ దగ్గరకు రాలేదు.

కాలం భారంగా, వేదనగా నడిచింది. ఏ పనీ చేయలేక పోయాను. స్థిమితంగా ఉండలేక పోయాను. ఆమెని చూడాలని ఉంటుంది. పిలవాలని ఉంది. కానీ ఎలా?

కిటికీ దగ్గర నిలబడి రకరకాల శబ్దాలు చేశాను. కూతలు పెట్టాను. ఫలితం లేదు. పిచ్చెక్కినట్టయింది.

ఒక వంక నా ప్రవర్తన నాకే ఆశ్చర్యంగా ఉంది. మరో వంక ఆమెని చూడకపోతే బ్రతకలేననిపిస్తోంది.

చివరికి ఆమెని కలవాలని, బయటకు వెళ్లి ఆమె గది తలుపు తట్టి మాట్లాడాలని నిశ్చయించాను.

నా గది తలుపు తీయబోతుంటే కిటికీ దగ్గర శబ్దమయింది.

పరుగు పరుగున కిటికీ చేరుకున్నాను.

సమ్మోహనంగా నవ్వుతూ నుంచుని ఉంది. ఒక్క క్షణంలో నా ఆవేదన, ఆందోళన, అనిశ్చింతతలన్నీ అదృశ్యం అయిపోయాయి. ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా అనిపించింది.

ఆ తరువాత సమయం ఎలా గడిచిందో తెలియదు.

చీకటి పడింది. నేను గమనించలేదు. గదిలో లైటు వేయలేదు.

ఇంతలో ఆమె నీడలలోకి జారుకుంది.

భోజనం తెచ్చిన వెయిటర్ తలుపు తట్టాడు.

అప్పుడు గమనించాను. నేను ఆమెతో మాట్లాడుతూ మైమరచిన సమయంలో సాలీడు నన్ను కూడా గూడులో భాగం చేసుకుంది.

ఒళ్లంతా దులుపుకుని, లైటువేసి తలుపు తీస్తుంటే ఓ

ఆలోచన వచ్చింది.

సరిగ్గా వెయిటర్ వచ్చే సమయానికి ఆమె వెళ్లిపోతుంది. వీళ్లు రావటం ఆమెకి ముందే ఎలా తెలుస్తుంది? వీళ్లురాగానే ఆమె వెళ్లిపోవటం సమంజసమే. కానీ అది ఆమెకు ముందే ఎలా తెలుస్తోంది?

నేను గమనించిన ఇంకో విషయం ఏమిటంటే, ఆమెను చూస్తున్నంత కాలం, నాకు కాలగమనం తెలియటం లేదు. మెదడులోకి వేరే ఆలోచనలు రావటం లేదు. ఒక రకంగా చెప్పాలంటే, ఆమె నా మెదడును ఆక్రమించేస్తోంది.

ఆమెతో ఎంత సమయం గడిపితే, ఆమె అంత దగ్గరగా అనిపిస్తోంది. అంతేకాదు, నా ప్రమేయం లేకుండా నేను ఆమె చెప్పినట్టు చేస్తున్న భావన కలుగుతోంది. నా మెదడుపై ఆమె నియంత్రణ సాధిస్తున్నట్టు అనిపిస్తోంది.

ఆమె పేరేమిటి? ఎన్నిరోజులు ఆమె ఈ హోటల్‌లో ఉంటుంది? ఎక్కడి నుంచి వచ్చింది? ఎటు వెళ్తుంది? లాంటి విషయాలన్నీ అడగాలని అనుకున్నాను. కానీ, ఆమెని చూడగానే అన్నీ మరచి పోతున్నాను. మళ్లీ ఆమె వెళ్లిన తరువాత అడగాల్సిన ప్రశ్నలు గుర్తుకు వస్తున్నాయి.

ఆ రాత్రి ఆఫీసర్ ఫోను చేసినప్పుడు ఈమె గురించి వివరాలు సేకరించ మని చెప్పాలనుకున్నాను. కానీ 'అంతా బాగానే ఉంది. ఎక్కడా ప్రమాద సూచనలేవీ లేవ'ని చెప్పాను.

'ఇప్పుడు ప్రమాదమేమీ ఉండదు. శనివారం అసలు ప్రమాదం. జాగ్రత్త. అన్నీ పరిశీలించు. గమనించు. ఏ విషయంలో అనుమానం కలిగినా, వెంటనే ఫోను చెయ్యి' చెప్పాడు ఆఫీసరు.

ఫోను పెట్టేసి నవ్వుకున్నాను. ఆ తరువాత గుర్తుకు వచ్చింది. ఆ గది గురించి, అమ్మాయి గురించి వివరాలు సేకరించమని చెప్పాలనుకున్న విషయం.

గురువారం అతి వేగంగా గడచిపోయింది. దూరం నుంచీ ఇద్దరం ఆటలు ఆడుకున్నాము. ఎప్పటిలాగే ఎవరయినా వస్తుంటే, ఆమె నీడల్లోకి జారుకునేది.

ఇప్పుడు అది అంతగా ఆలోచించాల్సిన విషయంలా అనిపించటం లేదు.

శుక్రవారం ప్రొద్దున్నే ఆఫీసరు ఫోను చేశాడు.

'అంతా మామూలుగానే ఉంది. ఎలాంటి ప్రమాద సూచనలు లేవు' చెప్పాను

'ఓ పని చెయ్యి. రేపు గంట గంటకీ ఫోన్ చేస్తుండు' అన్నాడు.

'అలాగే' అన్నాను.

ఫోను పెట్టగానే, ఎవరో లాగినట్టు కిటికీ దగ్గరకు చేరుకున్నాను. నన్ను నేను మరచిపోయాను.

ఆ రోజు రాత్రి నిద్రపడుతూంటే ఓ ఆలోచన వచ్చింది.

రేపు శనివారం. ఏమీకాదెలాగో. దాంతో నా డ్యూటీ ఇక్కడ అయి పోతుంది. అప్పుడు ఆ అమ్మాయి ఎవరో! నేనెవరో! ఎందుకో బాధగా అనిపించింది.

భారమైన గుండెతో శనివారానికి స్వాగతం పలికాను. ఆమె మధ్యాహ్నం వరకూ కనబడలేదు. అంతవరకూ చిరాగ్గా, విసుగ్గా గడిచింది. క్షణమొక యుగంలా గడవటమంటే ఏమిటో అర్థమైంది. వాళ్లు హోటల్ ఖాళీచేసి వెళ్ళిపోయారేమోనని అనుమానం వచ్చింది. దీనికి తోడు, గంట గంటకూ ఆఫీసర్ ఫోను చేసి 'అంతా ఓకేనా?' అని అడుగు తుండటం మరింత చిరాకు కలిగించింది.

చివరికి ఫోన్ స్విచాఫ్ చేసి విసిరి పారేశాను. ఇటు తిరిగే సరికి కిటికీ దగ్గర దేవదూతలా ఆమె ప్రత్యక్షమైంది!

'ఇంతవరకూ ఎక్కడ మాయమయ్యావు?' కోపంగా అడగబోయాను. కానీ నా గొంతునెవరో నొక్కి పట్టినట్టుంది. నోట మాట రావడం లేదు. కానీ సంతోషంగా ఉంది. హాయిగా ఉంది.

'మేమూ తెల్లారే వెళ్లిపోతాం' అందా అమ్మాయి.

'ఎటు?' అడగాలనుకున్నాను. 'అయ్యో! నా గతేమిటి?' అనడిగాను.

నవ్వింది. 'రాత్రికి కలుస్తా' అంది.

'ఎక్కడ?' అడిగాను.

'నీ గదికి వస్తాను' అంది.

నాకింక ఏమీ ఆలోచనలు రాలేదు.

'ఆమె నా గదికి వస్తుంది...' ఇది తప్ప మరో ధ్యాస లేదు.


సమయం ఎంతకీ గడవటం లేదు. గదిలో కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతూ గడిపాను. గది నిండా సాలీడు చకచకా అల్లేస్తోంది. పట్టించుకోలేదు. 'ఆమె వస్తుంది' అది తప్ప నా మెదడుకు ఇంకేమీ అర్థం కావటం లేదు.

ఆమె రాత్రికి వస్తానంది. కానీ ఏ సమయానికి వస్తుందో చెప్పలేదు. అడగాలన్న ఆలోచన నాకురాలేదు. దాంతో ప్రతిక్షణం ఉద్విగ్నత మయమయింది. చీమ చిటుక్కుమన్నా, ఆమెనేనేమో అని ఉలిక్కి పడుతూ వచ్చాను.

వెయిటర్ వచ్చి భోజనం పెట్టి వెళ్లాడు. అతడి వెనకే ఆఫీసర్ పరుగెత్తుకు వచ్చాడు.

'ప్రొద్దుటి నుంచీ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఏమైందోనని కంగారు పడ్డాను' అన్నాడు.

'ఏమీ కాలేదు. ప్రమాదమే లేదు' విసుగ్గా చెప్పాను. ఆయన ఎంత త్వరగా వెళ్లిపోతాడా అన్న దానిమీదే ఉంది నా దృష్టి. ఈయన ఉన్నప్పుడు ఆమె రాదు కదా!




వెళ్తూవెళ్తూ చెప్పాడు. 'క్రింద రెసెప్షనిస్టు దగ్గర ఇద్దరు కానిస్టేబుళ్లుంటారు. అవసరమైతే కబురు పెట్టు. సెల్ ఆన్ చెయ్యి'.

ఆయన సంతృప్తి కోసం సెల్ ఆన్ చేశాను.

ఆయన వెళ్లగానే ఆఫ్ చేశాను. గంట గంటకు ఆ బోరు ఎవరు భరిస్తారు!

గది నిశ్శబ్దమై పోయింది.

రాత్రి మత్తుగా ఉంది. నాకు అశాంతిగా ఉంది.

అలుపన్నది లేకుండా గదిని బూజుతో నింపుతున్న సాలీడుని చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది.

అద్భుతంగా ఉంది.

అమ్మాయి వస్తుందా? రాదా? ఎలా వస్తుంది? ఎప్పుడొస్తుంది?

అయినా, ఓ అమ్మాయి రాత్రిపూట అపరిచితుడి గదికి వస్తుందా? ఆమెతో ఎవరూ లేరా?

ఆమె ఏదో మాటవరసకు అన్నమాటలను నేను సీరియస్‌గా పట్టించు కోవటంలో అర్థం ఉందా?

ఇలా తుఫాను నాటి అలల్లా మనస్సు అల్లకల్లోలంగా ఉంది.

క్షణమొకయుగంలా గడుస్తోంది. ఒకో యుగం కొన్ని వేల కల్పాల్లా అనిపిస్తోంది.

అసహనంగా ఉంది.

గదిలోనే అటు ఇటు పచార్లు చేస్తూ కిటికీలోంచి ఆ వైపుకి చూస్తున్నాను. దృష్టికి సాలీడు గూడు అడ్డు వచ్చినప్పుడల్లా దాన్ని తొలగిస్తున్నాను.

వెయిటర్ భోజనం తెచ్చిపెట్టి మౌనంగా వెళ్లిపోయాడు. భోజనం వైపు చూడాలని కూడా అనిపించలేదు.

నా దృష్టి అంతా గడియారం పైనే ఉంది.

రాత్రి నెమ్మదిగా దట్టమౌతోంది.

కిటికీలోంచి ఆమె గది కనబడటం లేదు. ఆ గదిలో లైట్లు కూడా వెలుగుతున్నట్టు లేదు.

తెల్లారి వెళ్లిపోతానంది. కొంపతీసి రాత్రికే వెళ్లిపోలేదు కదా!

నన్ను ఏడ్పించటం కోసం రాత్రికి వస్తానని అన్నదా!

ఆడవాళ్లలో కొందరు శాడిస్టులుంటారు. ఇలావస్తానని ఊరించి, రాకుండా మగవాడు ఎదురుచూసి బాధపడటం వారికి ఆనందం కలిగిస్తుంది. బలవంతుడైన మగవాడిని బలహీనుడిని చేసిన తమ శక్తి వాళ్లకి గర్వం కలిగిస్తుంది.

ఈ అమ్మాయి కూడా అలాంటి సాడిస్టే అయి ఉంటుంది.

ఒక్కసారి వెనక్కుతిరిగి, మొదటి నుంచీ ఆలోచిస్తే, ఆమె ప్రవర్తన అసహజంగా అనిపిస్తోంది.

పేరు చెప్పలేదు. ఎటు వెళ్తుందో చెప్పలేదు. హోటల్‌లో ఒక్కర్తె ఉందో, కుటుంబ సభ్యులతో ఉన్నదో చెప్పలేదు. అసలు హోటల్‌లో ఎందు కున్నదో చెప్పలేదు. తన గురించి ఏమీ చెప్పలేదు. అయినా ఆమెని తాను ఎలా నమ్మాడు? ఆమె కోసం ఇంతగా తపించే స్థితికి ఎలా చేరుకున్నాడు?

మగవాడు పిచ్చివాడు. అమ్మాయి చూసి నవ్వితే చాలు, అన్నీ మరచి పోతాడు.

నేనీ గదికి వచ్చింది హత్యలు, ఆత్మహత్యలను పరిశోధించటానికి.

కానీ, అసలు విషయం మరచి, ప్రొద్దుటి నుంచి ఆమె ధ్యాసలో గడిపాను. ఆమె లోకంగా వారం గడిపేశాను.

'ఛ ఛ' నా పిచ్చితనానికి నాకే సిగ్గుగా అనిపించింది.

వారం పాటు ఉట్టిగా గదిలో గడిపేశాను. కనీసం, గది దాటి బయటకు వెళ్లి ఆమె గది నెంబరు కనుక్కోవా

లనీ అనిపించలేదు.

నేను డిటెక్టివ్‌నని చెప్పుకోవటమే సిగ్గుచేటు.

ఈ ఆలోచన రావటంతోటే తల విదిలించాను.

దృఢ నిశ్చయంతో తలుపు వైపుకు నడిచాను.

ఇంతలో గదిలో వెనుక శబ్దమయింది.

తిరిగి చూశాను.

చిత్రం! ఇందాక నేనున్న స్థలంలో కూడా సాలీడు గూడు కట్టేసింది. చూస్తుంటే, ఈ గది మొత్తం తన సామ్రాజ్యం అన్నట్టు ప్రవర్తిస్తోందీ సాలీడు. అడ్డు అదుపు లేకుండా పోతోంది.

వెర్రి కోపం వచ్చింది.

చకచకా బూజు దులిపేశాను.

వెనక్కి తిరిగేసరికి తలుపు దగ్గర ఆమె నిలుచుని ఉంది!

గదిలోకి ఎలా వచ్చింది?

వేసి ఉన్న తలుపులోంచి లోపలకు ఎలా వచ్చింది?

అడగాలనుకున్నాను. కానీ, చిత్రంగా, నోటిలోంచి మాట రాలేదు.

'అమాయక ప్రాణి మీద అంతకోపం ఎందుకు?' నవ్వుతూ అడిగింది.

కిటికీలోంచి నీడలలో చూశానింతవరకు ఆమెను. వెలుతురులో, దగ్గరగా చూడటం ఇదే ప్రథమం.

అందంగా ఉందనటం, ఎందుకంటే, అంతకన్నా గొప్ప అర్థాన్నిచ్చే వాక్యం తెలియక.

కానీ... కానీ...

ఆమె ఒక అడుగు ముందుకు వేసింది.

ఆ నడక సహజంగా లేదు. ఏదో, ఎక్కడో చూసినట్టుంది.

ఆమె ఇంకాస్త ముందుకు వచ్చింది.

నాకు తెలియకుండానే, నేను రెండడుగులు వెనక్కు వేశాను.

ఆమె తలుపును దాటి ముందుకు రావటంతో ఆ భాగంలో వెలుతురు పడింది.

ఒక్కసారిగా నా గుండె ఝల్లుమంది.

ఆమె వెనుకంతా సాలీళ్లు గూళ్లు కట్టేశాయి.

తలుపు కనబడటం లేదు.

అడుగు పెట్టినచోట కనకాభిషేకాలంటారు. అలా ఈ గదిలో అడుగు పెడితే సాలీడు గూడు.

'వెనక్కి వెళతావేం? ఎదురు చూశావుగా నా కోసం రా' అంటూ చేతులు సాచింది.

ఒక పెద్ద కేక గుండె లోతుల్లోంచి వెలువడి గొంతు చేరింది.

నోరు తెరుచుకుంది. కానీ శబ్దం బయటకు రాలేదు.

సాచిన ఆమె చేతులు, చిత్రంగా సాలీడు కాళ్లలా మారిపోతున్నాయి.

భయంతో నా ఒళ్లు గజగజలాడిపోతోంది.

వెర్రిగా ఆమె వైపు చూశాను.

ఆమె నవ్వింది.

ఆమె నోట్లోంచి వందల కొద్దీ సాలీళ్లు వెలువడుతున్నాయి.

ఆమె... ఆమె... రూపాంతరం చెందుతోంది!

ఆమె సాలీడులా మారిపోతోంది!

ఆమె శరీరం తీగలు తీగలుగా సాగిపోతోంది!

కళ్లు క్రిందకు జారిపోతున్నాయి. నోరు కళ్లతో పాటు జారి పొట్ట దగ్గరకు చేరుకున్నది.

ఇంతలో ఆమె శరీరం పైభాగం ముక్కలుగా విడిపోయి, సన్నని తీగలుగా సాగి, అతుక్కుని ఫటేల్మని క్రిందకు జారాయి.

పొట్ట క్రిందిభాగం ఒక్కసారిగా బలహీనమైనట్టు శరీరం క్రిందకు జారింది.

వెంటనే పైన తీగలుగా సాగిన భాగం, ఆంటెన్నాలలా నేలను తాకి ఆమె శరీరాన్ని నిలబెట్టాయి.

అంతలో, క్రింద భాగం వెనక్కులేచి, తీగలుగా సాగింది.

ఆమె కళ్లు, నోరు పొట్టలోపలకు పోయాయి. అవి కేంద్రంగా, తీగలుగా సాగిన ముందు వెనకభాగాలు నేలపై ఆధారాన్నిచ్చాయి.

నా కళ్లముందు ఒక అందమైన అమ్మాయి అతి భయంకరమైన సాలీడులా మారిపోయింది.

కానీ... కానీ... పుల్లల్లాంటి కాళ్లు చుట్టూ వెలువడుతున్న కేంద్రంలో ఆమె కళ్లు నన్నే చూస్తున్నాయి.

ఆ కళ్లలో భావం అర్థం కావటం లేదు.

సాలీడు ఒక అడుగు ముందుకు వేసింది.

హఠాత్తుగా నా మెదడులో మొదటిరోజు నేను చూసిన దృశ్యం కదిలింది.

అంతే. నాకు ఎక్కడలేని శక్తి వచ్చింది.

పరుగెత్తబోయాను... కానీ చుట్టూ దట్టమైన బూజు...

తలుపుకు అడ్డుగా ఆమె. కాదు... కాదు.... కాదు... దయ్యం సాలీడు.

నాకు ఉన్న ఒకే మార్గం కిటికీ!

నేనున్నది మూడో అంతస్థు. క్రిందకు దూకితే మహా అయితే కాళ్లు విరుగుతాయి.

కానీ ప్రాణం నిలుస్తుంది.

నేను మరేమీ ఆలోచించలేదు.

కిటికీ వైపు పరుగెత్తాను. పరుగెత్తుతూ సాలీడు వైపు చూశాను.

అది నవ్వుతున్నట్టుంది!

ఒక్క ఉదుటున కిటికీ చేరుకున్నాను.

కిటికీ కర్టన్‌ను పట్టుకున్నాను. కిందకు చూశాను. భయం వేసింది. కర్టను పట్టుకుని వ్రేలాడి, దూకటం వల్ల కాస్తయినా దెబ్బ తీవ్రత తగ్గుతుంది. కానీ... అలా దూకాలంటే భయంగా ఉంది.

వెనక్కు చూశాను.

సాలీడు కదులుతోంది.

ఇందాక ఆమె నడకను ఎక్కడో చూశాననిపించింది. ఆమెది సాలీడు నడక.

సాలీడు కదలటంతో నాకు తెగింపు వచ్చింది.

కర్టన్ పట్టుకుని కిటికీ లోంచి క్రిందకు దూకాను.

దేవుడిని తలచుకుని కర్టన్‌ను వదిలాను.

చిత్రం... నా చేతులు కర్టన్‌ని వదిలాయి. కర్టన్ నన్ను వదల లేదు.

సాలీడు నోట్లోంచి వెలువడుతున్న దారాలు... నా చేతులను కర్టెన్‌ను బంధించాయి.

నెమ్మదిగా నన్ను కర్టన్‌తో సహా పైకి లాగింది సాలీడు.

ఒక్క ఉదుటున నా గుండె పైకి దూకింది.

నా ఒళ్లు వణికిపోతోంది. అరవలేను. కదలలేను. మాట్లాడ లేను.

మౌనంగా, సాలీడునే చూస్తూ, వ్రేలాడుతున్నాను. ఆ గదిలో అందరూ ఎలా హత్యకు గురవుతున్నారో అర్థమయింది. కానీ... ఈ నిజం అందరికీ తెలియజెప్పేదెలా?

గుండెలపై ఉన్న సాలీడు ముందుకు వంగింది.

***

'ఇవి హత్యలో ఆత్మహత్యలో తెలియటం లేదు. వారం రోజులున్నాడు గదిలో. అనుమానాస్పదమైనవేవీ లేవన్నాడు. చివరికి ఇలా...'

అటాప్సీ చేస్తున్న డాక్టర్లు తలలెత్తి చూశారు.



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## భూత్ బంగ్లా

"మీరిచ్చే అద్దెకు ఇంతకన్నా మంచి ఇల్లు దొరకదు. అయినా, దీనికే మైందని? అన్ని సౌకర్యాలు వున్నాయి. కాకపోతే భూత్ బంగ్లా" అన్నాడు రియల్ ఎస్టేట్ ఏజెంట్.

"దయ్యాలుంటాయా యిక్కడ?" అని అడిగాడు డిటెక్టివ్. కిటికీ తలుపు వారగా తీసి మూడంతస్తుల కింది దృశ్యాన్ని పరిశీలిస్తూ.

"అవును. ఈ ఇంటి యజమానురాలి పేరు జెన్నిఫర్. 28 మార్చి 1979 నాడు ఆమె శరీరం ఆ కిటికీ నుండి కిందికి పడింది. మొదటిది అది ఆత్మహత్య అనుకున్నారు. ప్రమాదవశాత్తూ ఆమె కిందపడి వుంటుందని బుకాయించాడు భర్త. పైగా, మూసి వున్న కిటికీలోంచి అసలు ఎలా దూకింది అని సందేహం వెలిబుచ్చాడు. అయితే, పోలీసులతని మాట నమ్మలేదు. చివరికి శిక్ష కూడా పడింది లెండి".

"సాక్ష్యమేమిటి?"

"ఆ భార్యాభర్తలు ఎవరినీ ఇంటికి రానిచ్చే వాళ్లు కాదు. అందువల్ల ఆ సంఘటన గురించిన పూర్తి సమాచారం ఎవరికీ తెలియదు. కాని, పక్షులను పరిశీలించే అలవాటున్న ఓ వ్యక్తి (బర్డ్ వాచర్) బైనాక్యులర్స్‌తో తరుచూ ఆ కిటికీ వైపు చూసేవాడు. ఒకనాడు అతను, అలా పైకి చూస్తున్నాడు. కిటికీ గ్లాసు పైకి లేపి, భర్త ఆమెను కిందికి తోసేయటం చూశానని సాక్ష్యమిచ్చాడు".

"పాపం, అమాయకుడికి శిక్ష పడింది. కేసు రీ ఓపెన్ చేస్తే న్యాయం జరుగుతుంది" అన్నాడు డిటెక్టివ్.

డిటెక్టివ్‌కా అనుమానం ఎందుకు వచ్చింది?

సమాధానం: కిటికీ గ్లాసు పైకి లేపి కిందికి తోసేశాడని సాక్ష్యం.
కానీ కిటికీ రెక్కలు అడ్డంగా తెరుచుకుంటున్నాయి. అంటే ఆ స్టేట్‌మెంట్ అబద్ధమన్నమాట.

'గొంతు చుట్టూ కర్టన్ బిగుసుకుపోవడం వల్ల ఊపిరి అందక మరణం సంభవించింది.

బహుశా కిటికీలోంచి దూకినప్పుడు అక్కడ ఉన్న బూజు శరీరానికి అంటి ఉంటుంది. అబ్బ ఈ సాలీడులతో చచ్చే చావొచ్చింది' అంటూ ఓ డాక్టరు విసుగ్గా శవం గుండెకు అతుక్కుని ఉన్న సాలీడును లాగి విదిలించి పారేశాడు.

'ఇది ఆత్మహత్యేనంటారా?' అడిగాడు పోలీసు అధికారి.

'హత్య అనటానికి ఆధారాలు లేవు' చెప్పాడు డాక్టర్.

వాళ్లు పారేసిన సాలీడు నిశ్శబ్దంగా నీడలలోకి పాకింది.

✻